

# యుద్ధం

డిగ్రీ పూర్తికాగానే మిత్రులందరూ పి.జి. కోర్సులకు, ఉద్యోగాలకు వెళుతుంటె అతన్ని మాత్రం ఆ ప్రకటన విపరీతంగా ఆకర్షించింది. మీలో ఆసత్తా ఉందా ? అనే సైన్యంలో ప్రవేశ ప్రకటన అది.

అతడి పేరు.... సలంద్ర.

కరీంనగర్‌లో గది ఖాళీ చేసి ఇంటికి వెళ్ళేముందు మిలిట్రీలో చేరడానికి అప్లికేషన్ పూర్తిచేసి పంపుతుంటె రూమ్మేట్ సుధాకర్ సలంద్రని విస్మయంగా చూసాడు.

"ఏమిత్రా నువ్వు చేస్తుంది" ? అన్నాడు ఏదో దేశద్రోహానికి పాల్పడ్డంత కోపంగా "ఏమిటేమిటి ? మిలిట్రీ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌కి అప్లయ్ చేస్తున్నాను. సైనికుడినవ్వాలని వుంది'

"నీకేం పిచ్చా" ? అరచినట్టుగా అన్నాడు సుధాకర్. సలంద్ర నివ్వెరపోయాడు.

"పిచ్చేమిత్రా ? ఇందులో తప్పేంటి ? ఏం నాకు సైనికుడిగా సెలక్టయ్యే పర్సనాలిటీ,

నాలెడ్జిగాని లేదంటావా " ?

"మా ఇంట్లో తెలిపే ఈ పని చేస్తున్నావా ? మిలిట్రీ అంటె చావుకి సిద్దపడి పోవాలి. జీతం ఎల్డీసికి వచ్చినంత కూడా రాదు తెల్సా నీకు" ?

"సైన్యంలో చేరేది జీతం కోసమేనా ? అదొక సేవాతత్పరమైన భావన కాని దాన్ని ఉద్యోగంలా భావిస్తారేంటి" ? సలంద్ర అసహనంగా అన్నాడు కవర్ మీద స్టాంపులంటిస్తూ.

"దేశం బోర్డర్‌లో ఎండకు ఎండి, వానకు నాని చలికి చావాలి. అయినా ఈ బుద్ధి ఎలా పుట్టిందిరా నీకు. మా వాళ్ళకు నువ్వొక్కడివే కొడుకువని మర్చిపోతున్నావ్" తీవ్రంగా హెచ్చరించాడు సుధాకర్ గదిలోంచి బయటికెళ్ళబోతూ.

"ఏరా చిన్నప్పట్నించి 'ప్రతిజ్ఞ' లో భారతదేశం నా మాతృభూమి, భారతీయులందరు నా సహోదరులు, నాదేశం పట్లనూ, ప్రజల పట్లనూ సేవానిరతి కలిగియుందునని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందంనకు మూలం...అని వేలు, లక్షలసార్లు చదివావ్ కొంచమైనా నీకు ఈ దేశం పట్ల గౌరవం లేదా" ?

సలంద్ర మాటకు సుధాకర్ చివ్వున తిరిగాడు.

"శతకోటి లింగాల్లో బోడిలింగంలా ప్రేయర్‌లో మానిటర్‌గాడు చెబితే అరిచామే తప్ప ఆలోచించలేదు. అయ్యా...గాంధీగారూ నీ బుద్ధి కూడా భారతదేశం బోర్డర్‌లా వంకరటింకరగా పోతున్నట్టుంది. నీ ఇష్టమొచ్చినట్టు చావు" అనేసి విసురుగా వెళ్ళిపోయాడు.

సలంద్ర అన్యమనస్కంగానే అప్లికేషన్‌ని పోస్టు చేశాడు. తన ఆలోచనలు డిస్కరేజ్ అయినందుకు.

★ ★ ★ ★

వారం తర్వాత సలంద్ర రిక్రూట్‌మెంట్ ఆఫీస్‌కెళ్లే సరికి వందలాది మంది వున్నారు. మూడు గంటల తర్వాత రిటర్న్‌టెస్టు, రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, ఫిజికల్ ఫిట్‌నెస్ అన్నీ పూర్తయ్యాయి. సెలెక్టవుతానన్న నమ్మకం వస్తుంటె ఛాతీ ఆనందంగా పొంగుతోంది. ఆ సంతోషంతోనే బ్యాగ్ సర్దుకొని తన వూరెళ్లాడు.

ఎప్పుడూ ఎదురొచ్చే అమ్మ సలంద్రని చూడగానే ముభావంగా వంటింట్లోకి వెళ్లింది. చెల్లి దిగాలుగా నవ్వింది...

వాలు కుర్చీలో కూచున్న తండ్రి సలంద్రని చూడగానే "ఇప్పుడేనట్రా

రావటం...తమరేదో ఘనకార్యం చేసారట కదా ?" అన్నాడు. ఆ మాటలో కొంత వెటకారం సలంద్ర మనసుని తాకింది.

"నేనా ? ఏం చేసాను ?" అన్నాడు బ్యాగు చెల్లెలికిచ్చి షూస్ విప్పుతూ.

"తమరికి దేశభక్తి ఏదో బాగా నిండిందని తెల్సింది" అన్నాడు సీరియస్‌గా. ఆ మాటకు సలంద్ర నవ్వాడు. తండ్రికి మిలిట్రీకి అప్లయ్ చేసినట్టు సుధాకర్‌గాడు తెలిపి వుండాలనుకున్నాడు.

సలంద్ర ఏమీ మాట్లాడలేదు.

అతడి మనసు మూగవోతోంది వీళ్లంతా తననో దోషిలా చూస్తున్నారేమిటి ? తనేం తప్పు చేసాడు.

"మిలిట్రీకి అప్లయ్ చేసావట కదా ఎందుకూ ? చావడానికా ? " గద్దించినట్లు అడిగాడు తండ్రి.

తల్లి వచ్చి "ముందు వాణ్ణి కాళ్లు కడుక్కోనీయండి" అంది సీరియస్‌గా.

"కడుక్కోమను, మిలిట్రీలో జాయినయితే మాత్రం మీ మామ పిల్లనిచ్చి కాళ్లు కడుగనన్నాడు ".

సలంద్ర మనసు చివుక్కుమంది. తను సైనికుడిగా మారితే మామయ్య 'శశిత' నిచ్చి పెళ్లి చెయ్యడా ? తనేం ద్రోహం చేసాడు. సైనికుడంటె అదేమన్నా నీచమైన పనా ? ఎందుకు వీళ్లంతా ఇలా ఆలోచిస్తున్నారు.

. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చేస్తున్న మామయ్య శశిత నివ్వనన్నాడా ? ఆయన చేస్తున్నదేం పని ? రక్షణ కాదా ??

ఆలోచనలతోనే అతడికి వారం గడిచింది. మిలిట్రీకి అప్లయ్ చేసినందుకు వూర్లో వాళ్లు మెత్తగా మందలించారు. ఖాళీగా తిరిగే ఫ్రెండ్సయితే 'హలో సిపాయి' అని ఎగతాళిగా పిలవటం మొదలెట్టారు. వాళ్లని చూస్తే ఈ ప్రభుత్వం యువకులందరికీ నిర్బంధ సైనిక శిక్షణ ఇస్తే బావుండుననిపించేది.

"ఎంపిడివో రిక్రూట్‌మెంట్స్ పడ్డాయి. కాస్తా చదవరాదూ !"

"పియస్‌సి గ్రూప్ ఫోర్త్ కూడా పడింది అప్లయ్ చేయకపోయావా ? "

ఎదురుపడ్డ ప్రతిసారీ తండ్రి అరుస్తూనే వున్నాడు. సలంద్ర మౌనంగా వెళ్తుంటే...

"మిలిట్రీలో చేరాలన్న పాడుబుద్ధి ఎలా పుట్టిందిరా ?" తల్లి కొంగుతో కళ్లొత్తుకుంది.

'అన్నయ్యా...మానుకోరాదూ' చెల్లె బేలగా అడుగుతోంది.

సలంద్ర మనసులో ఘర్షణ...

అనుబంధాల తీగలు మనసు చుట్టూ అల్లుకుపోతుంటె...దేశభక్తి కెరటమై లేచి గుండెను ఢీకొంటూ వెనక్కి వెళ్లిపోతున్న సవ్వడి...

అనంతమైన సంఘర్షణ...

ఆ రోజు...మిలిట్రీ రిక్రూట్‌మెంట్‌లో సెలెక్టయినట్టూ...హిమాచల్‌ప్రదేశ్‌లో ట్రెయినింగ్ అంటూ ఆర్డర్స్ తండ్రి చేతిలో పడ్డాయి...

అంతే ! ఆ ఇంట్లో ఒక్కసారిగా అల్పపీడనం లేచింది.

ఏ టెలిగ్రామో వచ్చినట్టు కంపించిపోయారు.

తండ్రి, తల్లి, చెల్లి, మామయ్య అంతా సలంద్ర మీద చలిపిడుగులు కురిపించారు.

"నీకేం తక్కువయిందని సైన్యంలో కెళ్తున్నావురా...?" తండ్రి ఉగ్రమై అరుస్తున్నాడు.

"ఎందుకురా నీకీ ఆలోచన వచ్చింది ? నువ్వెళ్లనంత మాత్రాన అక్కడెవరూ అడగరు. మానుకోరా..." తల్లి కంఠంలో కూడా కోపం...దు:ఖం...

"మామయ్య మీరైనా చెప్పండి" సలంద్ర మాటతో గుర్రుగా చూసాడు ఎ.ఎస్.ఐ. " మేమే ఇక్కడ దినదినగండంగా చస్తున్నాంరా. నువ్వు సైన్యంలోకెళ్లి ఏం సంపాదిస్తావ్ ? నీ మరదలికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సెలెక్టయిన అబ్బాయితో పెళ్లి సంబంధం వస్తేనే మీ అత్తమ్మ అసలే ఒప్పుకోలేదు. ఎందుకో తెల్సా ? అసలు ఉద్యోగమే లేకున్నా శశితను నీకిచ్చి చేద్దామనుకుంటున్నాం..." సెల్‌లో థర్డ్‌డిగ్రీ ప్రయోగిస్తూ నిందితున్ని హుంకరించినట్టుగా చెప్పాడు. సలంద్ర చివ్వున తలెత్తి శశిత వైపు చూసాడు.

తలుపువోరగా తలొంచుకొని కుడికాలి బొటన వేలితో నేలమీద గీతలు గీస్తోంది.

"అన్నయ్యా...మీ ఫ్రెండ్ మునీందర్‌కి ఎస్సయ్‌గా జాబొస్తేనే జాయినవ్వక ఎస్.జి.బి.టి. టీచర్‌గా జాయినయ్యాడు. నీకు తెలీదా... అలాంటిది నువ్వింకా ఎక్కడికో వెళ్లి..." చెల్లి కూడా సీరియస్‌గానే అంది.

"మన మాటలు వాడి తలకెక్కవే...తుపాకి పట్టుకోకముందే తనో వీరజవాన్‌లా ఫీలవుతున్నాడు" తండ్రి ముఖం చిట్లించాడు.

"మన ఇంటావంటా లేదు కదరా ఇది. హాయిగా కనీసం ప్రయివేట్ ఉద్యోగమైనా చేసుకో సైనికుడంటే మృత్యువుతో చెలగాటమని తెలీదా డిగ్రీ చదివావ్..." తల్లి కోపంలో ప్రేమజీరలు.

"నా మాట వినరా సలంద్రా...నాకున్న పలుకుబడితో నీకిక్కడే ఏదైనా ఉద్యోగం సంపాదిస్తాను. శశిత కోసమైనా నువ్వెళ్లొద్దు" ఆజ్ఞాపించినట్టుగా వుంది ఎ.ఎస్.ఐ కంఠం.

శశిత నిశ్శబ్దంగానే చూస్తోంది.

"నువ్వేదో వంశాన్ని ఉద్ధరిస్తావనుకుంటె నీబుద్ధి ఇలా తగలడుతుందను కోలేదు. దరిద్రపు వెధవ" తండ్రి చిర్రెత్తిపోతున్నాడు.

సలంద్ర ఎవరి మొహాల్లోకి చూడలేకపోయాడు.

పదినిమిషాల నిశ్శబ్దం తర్వాత తలొంచుకొని చెప్పాడు.

"సరే...నేను వెళ్లట్లేదు..."

ఒక్కసారి అంతా రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకున్నారు. సలంద్ర అక్కడ ఉండలేక పెరటి తోట్లోకి వచ్చి తురాయి చెట్టుకింద మంచం మీద నొసటిమీద కుడి ముంజేతిని పెట్టుకొని కళ్లు మూసుకుపడుకున్నాడు అన్యమనస్కంగా...

మెదడంతా చిత్తడిగా మారింది...

మనసు కల్లోల భరితంగా వుంది...

మొహం మీద తురాయి పూలు రాలితే కళ్లు తెరచి చూసాడు. ఎదురుగా శశిత...

తురాయి పూలకన్నా అందంగా...రోజా పూలకన్నా మనోహరంగా...

శశిత మొహంలో ఏ భావమూ లేదు. నిర్మలంగా వుంది. నిశ్చలంగా వుంది.

"వెళ్లట్లేదని చెప్పాగా..." అసహనంగా అన్నాడు సలంద్ర.

"బావా...

వీళ్ల నరాల్లో నెత్తురుండదు...పెప్సికోలాలు, థమ్సప్‌లు ప్రవహిస్తాయి.

వీళ్ల కళ్లల్లో రెటీనా వుండదు...స్టార్‌టీవీల ఛానెళ్లతో టీవీ స్క్రీన్‌పై అంటించారు.

వీళ్ల గుండె గదుల్లో కన్నీళ్లుండవు...బిస్లెరీ మినరల్ వాటర్ తప్ప.

సాయం సంధ్యకు అనుభూతించరు...సంపాదించే సమయం తగ్గినందుకు బాధ తప్ప.

బోన్‌సాయ్ మొక్కని తప్ప...బాయ్‌నెట్‌ని ఆరాధించరు.

బర్త్‌డేలు, మేరేజ్‌డేలు తప్ప...కమేమొరేషన్ డేని కనీసం స్మరించరు, అదేరోజో కూడా తెలియదు.

సైనికులకీ సంసారాలుంటాయి...

సైనికులకీ జీవితాలుంటాయి...

ఈ రోజు ఇంట్లోనే గెలవలేకపోయావ్...రేపు సరిహద్దుల్లో యుద్ధమేం చేస్తావ్ ?

నాకు వ్యక్తిత్వమున్న భర్త కావాలి ...సెలవ్ "

గిరుక్కున తిరిగి వెళ్తోందామె.

సలంద్ర నివ్వెరపోయాడు.

శశిత వెళుతున్నట్టుగా లేదు...భరత మాత వెళ్తున్నట్టుంది.

'ఇంట్లోనే గెలవలేకపోయావ్...రేపు యుద్ధమేం చేస్తావ్ ? '

మంచంలోంచి దిగ్గున లేచాడు...

మరో గంటలో రైల్వేస్టేషన్‌కి ఎవరూ రాకపోయినా ట్రెయినెక్కాడు... రైలు కదిలేముందు కన్పించింది శశిత.

రైలు కదిలింది.

సలంద్ర చేయి వూపాడు కృతజ్ఞతగా... కళ్లల్లో నీళ్లు తిరిగినా... ఆమె చేయి వూపింది.

రైలు కనుమరుగయ్యేంత వరకూ... ఆమె చేయి వూపుతూనే వుంది.

**(నన్ను 'పెన్నుతట్టి' ప్రోత్సహించే మిత్రుడు, సహృదయుడు... ఎస్సయ్ సంజీవరావ్ ప్రేమతో... అభిమానంతో... ఈ కథ)**